మంత్రి మల్లారెడ్డి స్థిర ఆస్తులు రూ.90.24 కోట్లు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి చామకూర మల్లారెడ్డి స్థిర ఆస్తులు విలువ(భూములు, భవనాల విలువ) రూ.90,24,08,741 ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపారు. ఇందులో ఆయన సతీమణి చామకూర కల్పనా స్థిర ఆస్తుల విలువ రూ.38,69,25,565 పేర్కొన్నారు. తమ స్థిర ఆస్తులు(భూములు, భవనాలు) సూరారం, దూలపల్లి, అలియాబాద్, జీడిమెట్ల, యాడారం, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ ప్రాంతాల్లో ఉన్నట్లు మంత్రి మల్లారెడ్డి తెలిపారు. అలాగే, వివిధ బ్యాంకుల్లో తీసుకున్న అప్పులు(లోన్లు) రూ.7,39,94,301 కాగా, ఇందులో ఆయన సతీమణి కల్పనా పేరుతో ఉన్న అప్పులను రూ.4,48,95,098 తెలిపారు. అలాగే, చరా ఆస్తులు(వివిధ బ్యాంకుల్లో నగదు డిపాజిట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు) రూ.5,70,64,666 ఉన్నట్లు పేర్కొన్న మంత్రి మల్లారెడ్డి, ఇందులో సతీమణి కల్పనకు సంబంధించివి రూ.72,39,185గా తెలిపారు. వాహనాలకు సంబంధించిన వివరాలతోపాటు చేతిలో నగదు ఉన్నట్లు గానీ ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన పేర్కొనలేదు.

2018 ఎన్నికల అఫిడవిట్‌లో ఇలా..

2018 సంవత్సరంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా సీహెచ్.మల్లారెడ్డి ఎన్నికల అఫిడవిట్‌లో స్థిర ఆస్తులు విలువ రూ.49,26,79,933 చూపించారు. అలాగే, 2014లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల అఫిట్‌విట్‌లో మల్లారెడ్డి తన స్థిర ఆస్తుల విలువ రూ.48,85,25,332 గా పేర్కొన్నారు.

నేతల చూపు.. ఘట్‌కేసర్ వైపు..

- మేడ్చల్ గుండె.. ఉమ్మడి ఘట్‌కేసర్
- ఈ మండలంలో 2.5 లక్షల ఓటర్లు
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు.. అన్ని విధాలుగా నేతల ప్రయత్నాలు
- అంతుచిక్కని వలస ఓటర్ల నాడి
- ఇక్కడి నుంచి ఎమ్మెల్యేలైన ఇద్దరు నేతలు

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి మేడ్చల్‌లో మేడ్చల్, శామీర్‌పేట్, ఘట్‌కేసర్, కీసర మండలాలు ఉన్నాయి. పునర్విభజన తర్వాత నాలుగు మండలాలతో కలిసి నియోజకవర్గం ఏర్పడింది. నూతనంగా మూడు చింతలపల్లి మండలం, మేడిపల్లి, కాప్రా రెవెన్యూ మండలాలు ఏర్పడగా కాప్రాలోని కొంతభాగంతో కలిపి మేడ్చల్ ఏడు మండలాలతో నియోజకవర్గంగా ఉంది.

- బీఆర్ఎస్ ప్రభుత్వం మండలాల పునర్వ్యవస్థీకరణ చేయడంతో నాడు ఒక్క మున్సిపాలిటీ కూడా లేని మేడ్చల్ 7 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లు ఏర్పడ్డాయి. ఘట్‌కేసర్ మండలం నుంచి పిర్జాదిగూడ, బోడుప్పల్ కార్పొరేషన్లు, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. మేడ్చల్ మండలం నుంచి మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలు నూతనంగా ఏర్పడ్డాయి. కీసర నుంచి నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలు శామీర్‌పేట్ నుంచి మూడు చింతలపల్లి మండలం, జవహర్‌నగర్ కార్పొరేషన్, తూంకుంట మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి.



అందరి చూపు ఘట్‌కేసర్ వైపే..

- మేడ్చల్ నియోజకవర్గంలో 5,95,652 మంది ఓటర్లు ఉండగా ఉమ్మడి ఘట్‌కేసర్ పరిధిలో ఉన్న బోడుప్పల్, ఘట్‌కేసర్, మండలం మున్సిపాలిటీ, పోచారం, పిర్జాదిగూడ ప్రాంతాల్లో 2,46,597 మంది ఓటర్లు ఉన్నారు. సగం ఓటర్లు ఆ ప్రాంతంలోనే ఉన్నారు. ఉమ్మడి కీసర మండలంలో 1,13,740, జవహర్‌నగర్‌లో 76,685 మంది ఓటర్లు, ఉమ్మడి మేడ్చల్‌లో 89,685, ఉమ్మడి శామీర్‌పేట్‌లో 69,568 మంది ఓటర్లు ఉన్నారు. అధిక మంది ఓటర్లు ఘట్‌కేసర్ ప్రాంతంలోనే ఉండటంతో నేతల చూపు ఆ ప్రాంతంపైనే ఉంది.
- నేతలు ఉమ్మడి ఘట్‌కేసర్ మండలంలోనే అధిక దృష్టి సారించి పనులు చేస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేష్‌యాదవ్ బోడుప్పల్‌కు చెందిన నాయకుడు కావడం, ఆ గ్రామ సర్పంచ్‌గా పని చేయడంతో ఆ ప్రాంతంలో సుపరిచితుడు కావడంతో ఆయన అక్కడ ఇంటింటి ప్రచారం జోరుగా సాగిస్తున్నారు. మంత్రి మల్లారెడ్డి తన చిన్న కొడుకు భద్రారెడ్డితో పాటు భద్రారెడ్డి సతీమణి ప్రీతిని అక్కడ ఉంచి రాజకీయం నడిపిస్తున్నారు. మేయర్లు, చైర్మన్లు, కార్పొరేటర్లు బీఆర్ఎస్‌కు అధికంగా ఉండటంతో నాయకులు ప్రచారం సాగిస్తున్నారు.

అక్కడి నుంచి ఎమ్మెల్యేలైన ఇద్దరు నేతలు..

ఉమ్మడి ఘట్‌కేసర్ ప్రాంతానికి చెందిన ఇద్దరు నేతలు మేడ్చల్‌కు ఎమ్మెల్యేలుగా పని చేశారు. టీడీపీ నుంచి ఘట్‌కేసర్ మండలం కొర్రెముల గ్రామానికి చెందిన కె.సురేందర్‌రెడ్డి, ప్రతాపసింగారం గ్రామానికి చెందిన సుధీర్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచారు. మేడ్చల్ ఫలితం ఉమ్మడి ఘట్‌కేసర్, జవహర్‌నగర్‌లపై ఆధారపడి ఉండటంతో నేతలు ఆ ప్రాంతాలపైనే ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. మూడు ప్రాంతాల్లో అధికంగా వలస ఓటర్లు ఉండటంతో ఓటరు నాడి అంతుచిక్కడం లేదు. ప్రధానంగా వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ప్రజలే అధికంగా ఉండటం వారిని ప్రసన్నం చేసుకునేందుకు ఆ జిల్లాల నేతల ద్వారా మంతనాలు జరుపుతున్నారు. ఐదు మండలాలు ఉన్న మేడ్చల్ నియోజకవర్గ ఫలితం ఒక మండల ఓటర్లపైనే ఆధాపరపడి ఉండటంతో ఘట్‌కేసర్ మేడ్చల్‌కు కీలకంగా మారింది.

కీసరగుట్టలో పూజలు చేసి మల్లారెడ్డి నామినేషన్



కీసర ఆర్డీవో కార్యాలయంలో ఆర్వో రాజేష్‌కుమార్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న మల్లారెడ్డి

కీసర: కీసరగుట్ట శ్రీభవానీరామలింగేశ్వరస్వామి ఆశీస్సులతో మరోసారి మేడ్చల్ ఎమ్మెల్యేగా గెలుపొందుతానని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే నామినేషన్ సందర్భంగా ఉదయం 11 గంటల సమయంలో కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర దేవాలయానికి చేరుకున్న మంత్రి మల్లారెడ్డి గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారి ప్రత్యేక అభిషేక పూజలో పాల్గొన్నారు. అనంతరం కీసరగుట్ట వేద పండితులు మంత్రి మల్లారెడ్డికి స్వామివారి ఆశీస్సులతోపాటు మహా ప్రసాదాన్ని అందజేశారు. అక్కడి నుంచి ఆయన నేరుగా కీసర ఆర్డీవో కార్యాలయానికి చేరుకొని మధ్యాహ్నం 1 గంట తర్వాత బీఆర్ఎస్ తరఫున నామినేషన్ దాఖలు చేశారు. మంత్రి వెంట జెడ్పీవైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, మున్సిపల్ చైర్మన్లు ప్రణీతాగౌడ్, కౌకుట్ల చంద్రారెడ్డి, బీఆర్ఎస్ కీసర మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్ రెడ్డి, కీసర సర్పంచ్ మాధురి వెంకటేష్, నేతలు మంద సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ముఖ్యనేతల రాజీనామా



మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఉద్యమకారులు, నాయకులు

శామీర్‌పేట్: కొంతకాలంగా మంత్రి మల్లారెడ్డి తీరుతో అసంతృప్తిగా ఉన్న ముఖ్యనేతలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. తెలంగాణ ఉద్యమకారుడు, ఉమ్మడి శామీర్‌పేట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు విష్ణుగౌడ్, రైతుబంధు సమితి శామీర్‌పేట మండల అధ్యక్షుడు కంటం కృష్ణారెడ్డి, మూడుచింతలపల్లి మండల అధ్యక్షురాలు శ్యామలతో పాటు ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని పలువురు బుధవారం బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. అనంతరం మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏఎంసీ మాజీ డైరెక్టర్ సంతోష్‌కుమార్‌తో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరారు. మంత్రి కుటుంబ పాలనతో ఉద్యమకారులు, కార్యకర్తలు నలిగిపోతున్నారని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అణిచివేత భరించలేక పార్టీని వీడుతున్నట్లు వారు తెలిపారు.

ఘనంగా టీ పీసీసీ రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



ఘట్‌కేసర్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్‌లో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలు యాదవ్ ఆధ్వర్యంలో టీ పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆంజనేయులుగౌడ్, నర్సింగ్‌రావు, రాంరెడ్డి, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, కౌన్సిలర్ మల్లేశ్, మాజీ ఎంపీటీసీ శ్రీశైలం, అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశ్ ముదిరాజ్, రాధాకృష్ణముదిరాజ్, భూషణం, ఖయూమ్, జంగారెడ్డి, వీరేందర్‌యాదవ్, మాధవరెడ్డి, శశిధరన్, సిరాజ్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్లను కొత్తగా తీర్చిదిద్దేందుకు..

సాక్షి, సిటీబ్యూరో: అమెరికాలోని చికాగోకి చెందిన కార్ కేర్ స్టూడియో టర్టల్ వాక్స్ నగరానికి తన సేవల్ని విస్తరించింది. నగరంలోని ఎల్బీనగర్‌లోని రాజీవ్‌గాంధీ నగర్‌లో ఏర్పాటైన ఈ స్టూడియోను మంగళవారం ప్రారంభించారు. అత్యాధునిక కార్ల రీ మోడలింగ్, కస్టమైజ్డ్ సర్వీసెస్ ఈ స్టూడియో అందిస్తుందని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు.

సోనియాగాంధీ రుణం తీర్చుకుందాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

మల్కాజిగిరి: కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీర్చుకుందామని మల్కాజిగిరి ఎమ్మెల్యే పార్టీ అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావు అన్నారు. దుర్గానగర్‌లో జరిగిన కాలనీ వాసుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఎందరో ప్రాణత్యాగాలు చేశారని, వారి త్యాగాలు వృథా కాకూడదనే సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించారన్నారు. బంగారు తెలంగాణ చేస్తానని గద్దెనెక్కిన కేసీఆర్ పది సంవత్సరాల్లో తెలంగాణకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. ప్రజల పక్షాన కాంగ్రెస్ పార్టీ ఉందని, వారి సంక్షేమం కోసమే ఆరు గ్యారంటీ పథకాలను ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో జీఎన్వీ సతీష్‌కుమార్, వెంకటేష్ యాదవ్, సంపత్‌గౌడ్, కొండలు, జలంధర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, జాలయ్య తదితరులు పాల్గొన్నారు. మల్కాజిగిరి డివిజన్ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేసిన గోగికర్ అరుణ్‌కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

మల్కాజిగిరి అసెంబ్లీకి ఆరో రోజు ఏడు నామినేషన్లు

మల్కాజిగిరి: మల్కాజిగిరి అసెంబ్లీ స్థానానికి ఆరవ రోజు ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. మాజీ ఎమ్మెల్యే బీజేపీ నాయకుడు ఆకుల రాజేందర్ తరఫున ఆయన కుమారుడు, ప్రజా ఏక్తా పార్టీ నుంచి గద్దం పద్మజ, దేశ్ జనహిత్ పార్టీ నుంచి షేక్ ఫయాజ్ అహ్మద్, స్వతంత్ర అభ్యర్థులుగా రవికోటి మదన్‌మోహన్, కందిబండ నర్సింహారావు, పీసరి విజ్ఞేశ్వర్‌రెడ్డితో పాటు తెలంగాణ ప్రజా జీవన రైతు పార్టీ అభ్యర్థి చుండి శోభన్‌బాబు మరోసెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఇప్పటిదాకా 11 మంది నామినేషన్లు దాఖలు చేశారు. శుక్రవారంతో నామినేషన్ల గడువు ముగియనుంది.

ఇద్దరు బైండోవర్



అల్వాల్: నిబంధనలు అతిక్రమించి నేరాలకు పాల్పడిన ఇద్దరిని నేరేడ్‌మెట్ పోలీసులు మల్కాజిగిరి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, రాష్ట్ర మాజీ కార్యదర్శి బద్దం పరుశురాం రెడ్డి, వ్యాపార వేత్త బొబ్బిలి విజయ్‌రెడ్డిని బైండోవర్ చేశారు. ఈ ఎన్నికల్లో మరోసారి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

మల్లారెడ్డి.. ఐదేళ్లలో ఏం చేశావ్..?

- పూలు అమ్మి.. పాలు అమ్మి కాదు..
- భూకబ్జాలు చేసి ఆస్తులు పెంచుకున్నావ్..
- ఒక్క ప్రభుత్వ ఆసుపత్రి, కాలేజీ కట్టావా..?
- ఈ ఎన్నికల్లో మల్లారెడ్డి ఓటమి ఖాయం
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇళ్లు కట్టిస్తాం
- మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్

జవహర్‌నగర్: పూలు అమ్మి.. పాలు అమ్మి కాదు.. భూకబ్జాలు చేసి మల్లారెడ్డి ఆస్తులు పెంచుకున్నారని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్(జంగయ్య) యాదవ్ ఆరోపించారు. బుధవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్‌తో కలిసి రోడ్‌షో నిర్వహించి వివిధ డివిజన్లలో పాదయాత్ర చేసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి 10 సంవత్సరాల్లో తన ఆస్తులు పెంచుకున్నారని, నేను యాదవ కుటుంబంలో జన్మించానని, మా తాతల నుంచి పాలు అమ్మినా కోటీశ్వరులం కాలేదన్నారు. మేడ్చల్ జిల్లాలోని ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూములను కబ్జా చేసి విద్యాసంస్థలు, ఆస్పత్రులను నిర్మించాడని ఆరోపించారు.

ఒక్కరికీ దళితబంధు ఇవ్వలేదు..

- జవహర్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలంలో అక్రమంగా బహుల అంతస్తుల అక్రమ భవనాన్ని నిర్మించి.. కోడలు పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నావని, దాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి అప్పగించాలని డిమాండ్ చేశారు. వేల సంఖ్యలో దళిత కుటుంబాలున్న జవహర్‌నగర్‌లో ఒక్కరికీ కూడా దళితబంధు ఇవ్వలేదన్నారు. మళ్లీ మల్లారెడ్డిని గెలిపిస్తే భూములన్నీ అమ్ముకుంటారన్నారు.
- మల్లారెడ్డి కళాశాలలో పనిచేస్తున్న ఉద్యోగులతో వెట్టిచాకిరి చేయించడమే కాకుండా స్థానిక నాయకులను నమ్మకుండా వారితో డబ్బులు పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యా, వైద్య రంగాన్ని బలహీనపరిచి మల్లారెడ్డి కాలేజీలు, ఆస్పత్రులను అభివృద్ధి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



జవహర్‌నగర్ రోడ్‌షోలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్కప్రభాకర్‌గౌడ్, హరివర్ధన్‌రెడ్డి

5వేల ఇళ్లను కట్టించి ఇస్తాం..

- ఐదేళ్లలో ఏం చేశారని మల్లారెడ్డి ఓట్లు అడుగుతున్నాడని, 10 ఏళ్లలో ఒక్క ప్రభుత్వ ఆస్పత్రి, కళాశాలనైనా కట్టించాడా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే 5వేల ఇళ్లను కట్టించి పేదలకు అందజేస్తామన్నారు. డంపింగ్‌యార్డ్‌ను నగరానికి నాలుగువైపులా విస్తరిస్తామన్నారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. ఈ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌కు బుద్ధి చెబితేనే పేద ప్రజల బతుకులు మారుతాయన్నారు. రాష్ట్రంలో రాబోయేది కాంగ్రెసేనని అన్ని వర్గాల ప్రజలు చేతిగుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్‌ను బలపర్చాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్, కార్పొరేటర్ నిహారికగౌడ్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, నాయకులు కల్లెపల్లి సదానంద్, కాయిత రాజుయాదవ్, అనంతలక్ష్మి, మంజుల, రజిత, కొత్తకొండ వేణు, కన్నయ్యరాజు, వినయ్, మిట్టూ తదితరులు పాల్గొన్నారు.

నోడల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలి



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: సాధారణ ఎన్నికల నియమావళిలో బాగంగా గా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో నోడల్ అధికారులు సమన్వయంతో తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి ఎన్నికల వ్యయం, ఎక్సైజ్, జీఎస్టీ, ఎంసీసీ, నోడల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. శాసనసభ సాధారణ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై నోడల్ అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎన్నికల విధులు ఎంతో కీలకమైనవని, ఎక్కడా ఏ చిన్న పొరపాటు జరగకుండా అన్ని జాగ్రత్తలతో సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలకు గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా నగదు, మద్యం, పంపిణీపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఇతర వస్తువుల సీజ్ చేసిన సందర్భాల్లో అన్ని బృందాలు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో సీజ్ చేసే నగదు, బంగారం, మద్యం, ఇతర విలువైన అభరణాల విషయంలో నోడల్ అధికారులు మరింత సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సమావేశంలో నోడల్ అధికారులు డీసీవో శ్రీనివాస మూర్తి, డీటీవో నర్సింహ, ఎక్సైజ్ సూపరింటెండెంట్లు అరుణ్ కుమార్, విజయభాస్కర్, జీఎస్టీ అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

నందికంటి శ్రీధర్‌తోనే ఉంటాం..

అల్వాల్: ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్‌తోనే బీఆర్ఎస్‌లో కొనసాగుతామని పలువురు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తెలిపారు. బుధవారం జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నందికంటి శ్రీధర్, మర్రి రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో జితేందర్ ముదిరాజ్, రవి ముదిరాజ్, భాస్కర్ యాదవ్, దుర్గేష్, సతీష్ యాదవ్, రవి ముదిరాజ్, మనోజ్‌కుమార్ ఉన్నారు. వారు మాట్లాడుతూ తామంతా నందికంటి శ్రీధర్ నాయకత్వంలో 20 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నాం అన్నారు. శ్రీధర్ నాయకత్వంలో పనిచేస్తూ మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు.

41 నామినేషన్లు.. 39మంది అభ్యర్థులు..

సాక్షి, మేడ్చల్ జిల్లా: శాసనసభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు 73 నామినేషన్లు దాఖలు కాగా, బుధవారం ఒక్క రోజు మాత్రం 41 నామినేషన్లు దాఖలైనట్లు జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు.

మేడ్చల్ నుంచి 17 మంది నామినేషన్లు

సీహెచ్ మల్లారెడ్డి(భారత రాష్ట్ర సమితి), మురళీధర్ పెద్దపల్లి(స్వతంత్ర), జంగయ్య ఈదులకంటి(స్వతంత్ర), కులకర్ణి పవన్ కుమార్ (స్వతంత్ర), వీర వెంకటకృష్ణ మోహన్ కందేపి(స్వతంత్ర), బాల సుబ్రహ్మణ్యం ఊర(స్వతంత్ర), జైపాల్‌రెడ్డి గుమ్మడి(స్వతంత్ర), బలిజపల్లి చంద్రమౌళి (స్వతంత్ర), నవీన్‌కుమార్ సాయిని(స్వతంత్ర), రామంచర్ల శ్రీకాంత్(స్వతంత్ర), కంటే సాయన్న(స్వతంత్ర), పల్లవి సాంబయ్య(దళిత బహుజన పార్టీ), పుల్లూరి రవి (స్వతంత్ర), ఒక్కరం చౌదరి(స్వతంత్ర), మిట్ట నర్సయ్యగౌడ్ (స్వతంత్ర), చింతల అంకాలమ్మ (భరోసా పార్టీ), శ్రీలత కుంభం (స్వతంత్ర).

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



హోంగార్డు మారుతి(ఫైల్)

మేడ్చల్‌రూరల్: విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ట్రాఫిక్ హోంగార్డు రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువాత పడిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మూడుచింతలపల్లికి చెందిన మారుతి(40) మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని రాత్రి 11 గంటల సమయంలో తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలోని రావల్‌కోల్ చౌరస్తా వద్ద హోంగార్డు స్కూటీకి టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలైన మారుతిని చికిత్స నిమిత్తం సుచిత్రలోని రష్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతి చెందిన హోంగార్డు మారుతికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

గుర్తుతెలియన వాహనం ఢీకొని..

గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్‌లో ఓఆర్ఆర్‌పై చోటు చేసుకుంది. మంగళవారం అర్ధరాత్రి మేడ్చల్ ఓఆర్ఆర్‌పై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

సీఈఐఆర్ టెక్నాలజీతో 20 సెల్‌ఫోన్లు గుర్తింపు

కుషాయిగూడ: కొత్తగా అందుబాటులోకి వచ్చిన సెంట్రల్ ఇక్విప్‌మెంట్ ఐడెంటీ రిజిస్టర్ (సిఈఐఆర్) టెక్నాలజీతో పోగొట్టుకున్న 20 సెల్‌ఫోన్లను గుర్తించిన కుషాయిగూడ క్రైం పోలీసులు బుధవారం బాధితులకు అందజేశారు. వీటి విలువ సుమారు రూ.3 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. కుషాయిగూడ ఏసీపీ రవీందర్ చేతులమీదుగా సెల్‌ఫోన్లను అందజేశారు. సెల్‌ఫోన్లను గుర్తించడంలో చాకచక్యంగా విధులు నిర్వహించిన కుషాయిగూడ క్రైం సిబ్బందిని ఏసీపీ అభినందించారు. సెల్‌ఫోన్లు పోయిన బాధితులు తగిన పత్రాలు సమర్పించి సకాలంలో పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, క్రైం ఇన్‌స్పెక్టర్ బి.సాయిప్రకాశ్‌గౌడ్ పాల్గొన్నారు.

మాదిగ మహాసభను విజయవంతం చేయాలి

ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్



మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేష్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ అరుంధతినగర్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ హాజరై ఈనెల 11వ తేదీన జరగబోయే మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభ కరపత్రాన్ని అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగ, మాదిగ ఉపకులాలకు సామాజిక న్యాయం జరగాలంటే.. అది కేవలం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ నెల 11న నిర్వహించే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శివకుమార్, నాయకులు కొయ్యడ వెంకటేష్, రామాంజనేయులు, కొత్త నరేష్, డోయ శ్రీనివాస్, ఏసన్న, పరమేష్, విక్రమ్, నవ్యరాజ్, మనోజ్, రాకేష్, తిరుపతి, కళ్యాణ్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్ డే

బోడుప్పల్: బోడుప్పల్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం పూర్వ ప్రాథమిక విద్యార్థుల గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ కౌశిక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వారితో తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల సత్ప్రవర్తన, మంచి నడవడికకు అమ్మమ్మలు, తాతయ్యలు ఇచ్చే చేయూత, చెప్పే కథలు, ఆట పాటలు, వారి అనుభవాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఆధునిక కాలంలో తల్లిదండ్రులు పిల్లలకు సరైన సమయాన్ని కేటాయించి గడపలేక పోతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నళిని జయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రాండ్ పేరెంట్స్ పాల్గొన్నారు.

మార్పు కోరుతున్న రాష్ట్ర ప్రజలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్



ఈసీఐఎల్‌లో అభివాదం చేస్తున్న సీపీఐ, కాంగ్రెస్ శ్రేణులు

ఉప్పల్: ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ గెలుపే ధ్యేయంగా కృషి చేస్తామని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్ హామీ ఇచ్చారు. ఇక నుంచి ముమ్మరంగా అభ్యర్థి గెలుపు కోసం ఎన్నికల ప్రచారంలో తాము పాల్గొంటామన్నారు. బుధవారం ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.శంకర్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి సీపీఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి మందుముల పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం సీపీఐ, కాంగ్రెస్ శ్రేణులు ఐక్యంగా అభివాదం చేశారు. వీఎస్ బోస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, ఈ ఎన్నికలు అవినీతికి, అభివృద్ధికి మధ్య జరుగుతున్నట్లు ప్రజలు భావించి బుద్ధి చెప్పాలన్నారు. కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, ఉద్యోగులు అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్‌తో విసుగు చెందారని అన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి దామోదర్‌రెడ్డి, కె.ధర్మేంద్ర, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.